# బాలప్రహ్లాద

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

## ౧వ రంగము

(హిరణ్యకశిపుడు సింహాసనాసీనుడై ఉండగా చండామార్కులు ప్రహ్లాదుడు ప్రవేశిస్తారు.)

ప్ర:- తండ్రీ నమస్కారము (వంగి నమస్కరిస్తాడు)

హి:- దీర్ఘాయురస్తు. కుమారా! యిటు రమ్మ (అని దగ్గరకు తీసుకొని తల నిమురుచూ చండామార్కులను చూచి) ఆచార్యా ఆ ఆసనముపై కూర్చుండుము. (కూర్చున్న పిమ్మట)

హి:- ఆచార్యా, ఏమి విశేషము? శిష్యసహితంగా వచ్చారు.

చం: ప్రహ్లాద కుమారుని విద్యాప్రావీణ్యత ప్రభువు వారిసన్నిధి నొకమారు ప్రదర్శింప జేయవలయునని అభిలాష.

హి:- ఓహో! అదా విశేషం, చక్కగా చదువుకుంటున్నాడా?

చం:- చాల బాగుగా చదువుకొనుచున్నాడు,

హి:- పాఠాలు చురుకుగా వస్తున్నవా?

చం:- అతి శీఘ్రముగా వచ్చుచున్నవి. కుమార ప్రభువు అఖండ ప్రతిభాశాలి. ఒకమారు చెప్పిన పాఠములు మరల చెప్పనక్కరలేదు.

హి:- గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి చక్కగా ఉన్నదంటారు?

చం:- సందేహమేమి? ఇంతటి మేధావియైన బాలుడు దానవకులమున నభూతో నభవిష్యతి! ఒక్కమారు చెప్పిన మాత్రముననే సమస్త శాస్త్రములూ మంచినీళ్ల ప్రాయమైపోవుచున్నవి.

హి:- (మహా సంతోషంతో మురుస్తూ ప్రహ్లాదుని అక్కున జేర్చుకొని ముద్దాడుచూ) కొమారా! సమస్త శాస్త్రాలు అంత సులభంగా నేర్చుకుంటున్నావా? అయితే మనం ముఖ్యంగా తెలుసుకోవలసిందేమో చెప్పు?

ప్ర:- భగవన్మహిమ.

హి:- (తెల్లబోయి ఆలింగనం చేసుకుంటున్న ప్రహ్లాదుని నెమ్మదిగ వదిలిపెట్టుతూ) మనం ఏమి నేర్చుకోవాలె?

ప్ర:- భగవత్సేవ.

హి:- (మతికొంత కోపంతో కొమారుణ్ణి తోస్తూ) మనం దేనిని నమ్ముకోవలె?

ప్ర:- భగవంతుని అనుగ్రహమును.

హి:- (మహా కోపంతో కొమారుణ్ణి అవలకు త్రోసి మళ్లీ దగ్గరకు లాక్కొని కోపంతగ్గిన గొంతుతో ప్రేమను చూపిస్తూ) కొమరా! ఇవేమి పిచ్చి మాటలు. మనం తెలిసికోవలసింది రణతంత్రం, రాజతంత్రం; మనం నేర్చుకోవలసింది శత్రు నిర్మూలనోపాయాలు. మనం నమ్ముకోవలసింది భుజబలం. మనం ప్రభువులం, త్రిలోకాధిపతులం. ఈ త్రిజగద్రక్షణ భారమంతా మన భుజస్కంధంపై ఆధారపడిఉన్నది. వేల్పుల నెత్తిపైమొట్టి వారిచే వెట్టిచాకిరిచేయించుకొనే జగజెట్టులం. వారుబానిసలు; మనంప్రభువులం. ఆ గర్భశత్రువైన వైకుంఠుడితో హోరాహోరి పోరాడవలసిన మన మెక్కడ? ఆ దౌర్భాగ్య దామోదరుని స్మరించు టెక్కడ? ప్రహ్లాదా!

ఆ నారాయణ నామస్మరణ మనకు కులోచితం గాదు, వీరోచితం గాదు, రాజోచితంగాదు. ఆ పాపాత్ముని పేరు తలపెట్టకుండా ఆచార్యుల వారివద్ద నీవు నేర్చుకొనిన సర్వశాస్త్రాలసారము ఒక్క ముక్కతో చెప్పి నన్ను సంతోషపెట్టు నాయనా? ఏదీ ఒక్క శాస్త్ర వాక్యం.

ప్ర:-తండ్రీ!

"శోధింపంబడె సర్వశాస్త్రములు
రక్షోనాథ; వేయేటికిన్
గాథల్; మాధవ శేముషీ తరణి
సాంగత్యంబునన్ గాక దు
ర్మేధన్ దాటగవచ్చునే సుతవధూ
మీనోగ్రవాంఛా మద
క్రోధోల్లోల విశాలసంసృతి మహా
ఘోరామితాంభోనిధిన్."

హి:-మరల యిదేమి దుర్బుద్ధిరా మూఢా! ఆచార్యా! నాబిడ్డకు మీరు నేర్పిన పాఠములివేనా?

చం:-(భయంతో గడగడవడకి చేతులుసలుపుకుంటూ) శివ! శివ! మే మిటువంటి పాఠములు చెప్పదుమా ప్రభూ! త్రివర్గ పాఠములన్నియు నూరిపోసితిమి. అన్నియు ఎంత చక్కగనో వల్లించెను. ఎంత విపులముగనో అర్థతాత్పర్యాదులు నేర్చెను. అవి అన్నియు తమకు వినిపింప జేయవలయునని తమ సన్నిధికి తోడ్కొని వచ్చితిని. తమ సమక్షమున వానిని వివరించుట మాని యిట్లు వదరుచున్నాడు. ఇది మేము నేర్పిన విద్యగాదు, సహజముగా పుట్టిన బుద్ధి.

హి:-ఆచార్యులు చెప్పని విషయములు నీకెట్లు వచ్చినవిరా?

ప్ర:-దైవికముగ.

హి:-ప్రహ్లాదా! పసివాడవని దయతలచిన కొలది నీ చిత్తం వచ్చినట్లు ప్రేలుతున్నావు. ఇకదయచూడనుసుమా. నానాహింసలపాలు చేస్తానుసుమా.

ప్ర:-అనుభవకాలం వచ్చినప్పుడు తప్పించుకొనగలమా తండ్రీ.




హి:-అయితే చావుకు సిద్ధంగా ఉన్నావన్నమాట.

ప్ర:-భగవదేచ్ఛ ఎట్లున్న అట్లుజరుగగలదు. మృత్యువును తప్పించుకొనే వారెవ్వరు? పుట్టిన వారెల్ల గిట్టవలసినదేగదా.

హి:-(మహా కోపంతో పండ్లు పటపట కొరుకుచూ) ఆచార్యా! ఊరకున్నకొలది వీని వాచాలత్వం మేరమీరిపోతున్నది. ఇక వీనిని ఉపేక్షించడం మా దైత్య వంశ వినాశనాన్ని అపేక్షించడమే. కనుక వీనిని రేపే వధించు ఏర్పాట్లు చేస్తాను పొండి. (ప్రహ్లాదు వెన్నుపై చేయిపెట్టి నెట్టుతూ) దౌర్భాగ్యుడా! కడుపు చెఱుప బుట్టావు; వినాశకాలే విపరీత బుద్ధిః. పో; నీకు మృత్యువు దాపురించినది.

ప్ర:-

శరణం భవ కరుణామయి కురు దీనదయాళో।
కరుణారస వరుణాలయ కరిరాజ కృపాళో॥

(అని భగవత్సంకీర్తన చేస్తూ వెళ్తాడు.)

చం:-(భయంతో వణుకుతూ) మహాప్రభూ! పిల్లవాడు పసికందు. తెలిసియు తెలియని ప్రాయము. దారుణ శిక్షల పాలుచేయుట ప్రమాదమేమో!

హి:-ఇటువంటి శాత్రవ పక్షపాతి నాయింట పెరిగి పెద్దవాడు కావడంకంటె మించిన ప్రమాదం లేదు పొండు. (227 వ-పుట చూడుడు)




నెల్లూరినుండి నేతిడబ్బాలలో "వెన్న" పేరట బియ్యమును రైలులో పంపగా పోలీసులు తెలుసుకొని పట్టుకున్నారు.

* * *

భద్రాచలం చుట్టుప్రక్కల మశూచికము వ్యాపించియున్నందున ఈసారి శ్రీరామనవమికి ప్రత్యేకపు ప్రయాణపు సౌకర్యము ఏర్పరుపబడలేదు.

* * *

చెన్నపట్నంలో "పవర్ సోడా" అనే మారుపేరుతో - "మద్యము" విక్రయింపబడుచున్నదని జీవరత్నంగారు కార్పొరేషన్‌లో చెప్పినారు.

* * *

అలాస్కా అనే దేశంలో 40000 మగవారు; 20000 మందే ఆడువారు, అయినా చాలామంది పురుషులు అవివాహితులట. అందుచేత అచ్చటి శాసనసభలో పెండ్లిగానియువకులు తల 1 కి సం|| నకు 1 పౌ. 10 షిల్లింగులు. (సుమారు 165 రూ|| లు.) పన్ను ఇచ్చుకోవలెనని బిల్లు ప్రవేశపెట్టబడినది.

* * *

పారిస్‌నగరమందలి విజ్ఞానశాస్త్ర పరిషత్తునందు శ్రీ సర్. సి. వి. రామన్‌గారిని సభ్యులుగా నియమించుకున్నారు. ఆసియా ఖండవాసులలో నీగౌరవము పొందినవా రిప్పటికివీరే.

* * *

కెన్యాలో విమానము నడిపే బ్రిటిష్‌వాడొకడు ఆఫ్రికాదేశపుస్త్రీని తుపాకితో కాల్చిచంపినాడు. ఆ నేరానికి అతనికి 8 నెలలు కఠినశిక్ష వేశారు !

* * *

ఇటీవల కలకత్తానుండి 1000 కోతులు అమెరికాకు ఎగుమతిఅయినవి. ఈవిధంగా వాళ్లు పిట్టలు కోతులు మనదేశాలనుంచి తెప్పించుకొంటున్నారు. వీటిని వైద్యపరిశోధనకు క్రొత్తఆయుధసామగ్రి పరీక్షకు ఉపయోగిస్తారట.

* * *

---

(204 వ-పుట తరువాయి)

చం:-మరి బాలకుని చదువుమాట.

హి:-వాడికింకా చదువు! వాడి చదువిక మృత్యు సన్నిధిలోనే.

చం:-చేతనైనంత వరకు చెప్పిచూడవలయునుగదా? గృహస్థ ధర్మములు నేర్పు మందురా?

హి:-మీ యిష్టం. (తెర)